# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | శుక్రవారం - 31- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 57 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in


## సూపర్ ఎల్‌నినోపై అప్రమత్తం




- రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన
- తాగునీటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళిక
- అన్ని శాఖల సమన్వయంతో చర్యలు
- జిల్లా యంత్రాంగానికి మంత్రి కీలక ఆదేశాలు

**రాజన్న సిరిసిల్ల, జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):** సూపర్ ఎల్‌నినో ప్రభావంపై రైతులు, ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి. గితేతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం రూపొందించిన సూపర్ ఎల్‌నినో కార్యాచరణ ప్రణాళికను అధికారులు ప్రజెంటేషన్ ద్వారా

మిగతా 2లో

## నైపుణ్య విద్యపై సీఎం దృష్టి



- పన్నెండో తరగతి తర్వాత నైపుణ్యాలపై దృష్టి
- ప్రభుత్వ విద్యను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యం
- ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ
- విద్యార్థులను ప్రపంచ స్థాయి అవకాశాలకు సిద్ధం చేయాలని పిలుపు



**హైదరాబాద్, జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):** మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు విద్య పూర్తిచేసిన అనంతరం విద్యార్థులను నైపుణ్యాధారిత విద్య, ఉపాధి అవకాశాల వైపు మళ్లించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు సమిష్టిగా

మిగతా 2లో

## వర్షాలపై అధికార యంత్రాంగం అప్రమత్తం

- భారీ వర్షాల నేపథ్యంలో మంత్రి పొంగులేటి సమీక్ష
- రెడ్, ఆరెంజ్ అలర్ట్ జిల్లాల్లో ప్రత్యేక నిఘా
- ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం




**హైదరాబాద్, జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):** ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనిస్తున్న తీవ్ర వాయుగుండం, చురుగ్గా ఉన్న నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జిల్లాల అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ, గృహనిర్మాణ, సమాచార-పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. జిల్లా స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. గురువారం రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్రంలోని తాజా వర్ష పరిస్థితులను సమీక్షించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, రానున్న రెండు రోజుల్లో కురిసే వర్షాల తీవ్రతపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. భారీ వర్షాలు నమోదవుతున్న జిల్లాల్లో

మిగతా 2లో

## ఉద్యోగుల బకాయిల విడుదల

- 100 రోజుల్లో రూ.6 వేల కోట్లు చెల్లింపు
- మరో రూ.2 వేల కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- కమ్యూటేషన్ బకాయిలకు పూర్తిస్థాయి పరిష్కారం
- ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబాటు

**హైదరాబాద్, జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసింది. ఉద్యోగ సంఘాల నాయకులకు ఇచ్చిన మాట మేరకు 100 రోజుల్లో రూ.6 వేల కోట్ల బకాయిలను విడుదల చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, మూడు విడతల్లో ఆ మొత్తాన్ని పూర్తిగా చెల్లించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా గురువారం మరో రూ.2 వేల కోట్ల నిధులను విడుదల చేశారు.

మిగతా 2లో



## అంగన్వాడీలకు మౌలిక వసతులు

- వంద శాతం సౌకర్యాల కల్పనకు ఆదేశాలు
- చిన్నారులకు పాలు, అల్పాహారం అమలు వేగవంతం
- టీచర్లు, ఆయాలతో జిల్లా వారీగా సదస్సులు
- బాలల సంక్షేమానికి సమగ్ర కార్యాచరణపై దృష్టి
- మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క



**హైదరాబాద్, జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తెలిపారు. గత ఏడాది కాలంలోనే అదనంగా 5,938 అంగన్వాడీ కేంద్రాలకు మరుగుదొడ్లు, 3,815 కేంద్రాలకు తాగునీటి సౌకర్యం, 14,271 కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించిన అధికారులను మంత్రి అభినందించారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన శాఖ సమీక్ష సమావేశంలో శాఖ కార్యదర్శి శృతి ఓజా, జాయింట్ డైరెక్టర్ మోతి తదితర అధికారులతో కలిసి పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు.

మిగతా 2లో

## ముగిసిన ఉద్యమ కెరటం ప్రస్థానం..

### మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరు

**హైదరాబాద్,జులై31(తెలంగాణ ముచ్చట్లు):** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి గురువారం అర్ధరాత్రి హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. గత ఆదివారం తీవ్ర గుండెపోటుతో అస్వస్థతకు గురైన ఆయనను అత్యవసరంగా ఆసుపత్రికి తరలించగా, అప్పటి నుంచి వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగింది. వైద్యుల బృందం అన్ని విధాలుగా ప్రయత్నించినప్పటికీ శుక్రవారం రాత్రి 12:51 గంటలకు ఆయన మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు.పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి వార్తతో ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన నివాసం వద్దకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో చేరుకుని నివాళులర్పిస్తున్నారు.

మిగతా 2లో



## ఎఫ్‌ఆర్‌సీ జారీలో జాప్యం

- వేలాదిగా పెండింగ్‌లో దరఖాస్తులు
- రెండు రోజుల్లో ఇవ్వాలన్న నిబంధన అమలు కరువు
- మీసేవ కేంద్రాల చుట్టూ దరఖాస్తుదారుల ప్రదక్షిణలు
- తహశీల్దార్ల స్థాయిలో మందగించిన ప్రక్రియ

**హైదరాబాద్, జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్ (ఎఫ్‌ఆర్‌సీ) జారీ ప్రక్రియలో జాప్యం నెలకొంది. దరఖాస్తు చేసిన రెండు పనిదినాల్లోనే ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు సరిగా లేకపోవడంతో

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నైపుణ్య విద్యపై సీఎం దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో విద్యా అధ్యయన పర్యటన పూర్తి చేసుకుని వచ్చిన ఉపాధ్యాయ ప్రతినిధులతో హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ దాశరథి ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్నెండో తరగతి పూర్తయ్యే సమయానికి ప్రతి విద్యార్థికి ప్రపంచ పరిస్థితులపై సమగ్ర అవగాహన ఉండేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ముఖ్యమంత్రి అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని, వారు విద్యార్థుల భవిష్యత్తుపై దృష్టి సారించాలని కోరారు. వచ్చే విద్యా సంవత్సరానికి చేపట్టాల్సిన సంస్కరణలపై డిసెంబర్‌లోగా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని, ప్రతి మండలాన్ని ఒక విద్యా సమూహంగా ఏర్పాటు చేసి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.



ప్రపంచ దేశాలు తెలంగాణ ప్రభుత్వ విద్యా వ్యవస్థను ఆదర్శంగా చూసే స్థాయికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయుల నుంచి సూచనలు స్వీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఉపాధ్యాయ సంఘాలు తమ సమస్యలకంటే పిల్లల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. అమెరికాపైనే దృష్టి కేంద్రీకరించే ధోరణిని మార్చుకొని జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్, చైనా వంటి దేశాల్లో ఉన్న ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. భాషా పరిజ్ఞానంతో పాటు నైపుణ్యాలు ఉంటే విదేశాల్లో అధిక వేతనాలతో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. శ్వేతకాలర్ ఉద్యోగాలతో పాటు నైపుణ్యాధారిత ఉద్యోగాలపైనా విద్యార్థులను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని వివరించారు.

విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో దాదాపు తొమ్మిది శాతం నిధులు కేటాయించామని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో సుమారు 27.50 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్నారని, ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం సగటున రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో గత మూడేళ్లుగా విద్యార్థుల ప్రవేశాలు పెరుగుతున్నాయని, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల ప్రారంభం, నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు అల్పాహార పథకం అమలు, 23 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు, 30 వేల మందికిపైగా బదిలీలు చేపట్టిన విషయాలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని, భవిష్యత్ తరాలను స్వయం సమర్థులుగా తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని అన్నారు. సమావేశానికి ముందు ఫిన్లాండ్, జర్మనీ పర్యటనకు వెళ్లి వచ్చిన ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను ముఖ్యమంత్రి సందర్శించారు.

# సూపర్ ఎల్‌నినోపై అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

వివరించగా, తెలంగాణ జలసిరి పేరుతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా పరిధిలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు, వివిధ పంటల సాగు విస్తీర్ణం, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా, విద్యుత్ పరిస్థితులు తదితర అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం దక్షిణ భారతదేశంపై అధికంగా ఉండే అవకాశం ఉన్నందున రిజర్వాయర్లలో ప్రస్తుతం ఉన్న నీటిని వచ్చే ఏడాది జూలై వరకు ప్రధానంగా తాగునీటి అవసరాలకే వినియోగించేలా సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలు పంటలకు కొంత మేలు చేసినప్పటికీ పూర్తి స్థాయిలో సరిపోవని, నీటి వినియోగంలో అత్యంత జాగ్రత్త అవసరమని సూచించారు.

గత రెండు నెలలుగా తగిన వర్షాలు లేకపోవడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిందని మంత్రి పేర్కొన్నారు. రైతులకు ఆరుతడి, స్వల్పకాలిక పంటలు, పప్పు ధాన్యాలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. అవసరమైన నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని, అధికారులు క్షేత్ర స్థాయిలోకి వెళ్లి రైతులకు ప్రత్యక్షంగా సలహాలు అందించాలని స్పష్టం చేశారు. నానో యూరియా వినియోగంపై కూడా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. భూగర్భ జలాలు గత ఏడాదితో పోలిస్తే రెండు మీటర్లకు పైగా తగ్గిపోయాయని పేర్కొన్న మంత్రి, జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని ఆదేశించారు. తెలంగాణ జలసిరి కార్యక్రమం కింద బోర్‌వెల్ రీఛార్జ్ పనులు, ఫార్మ్ పాండ్ల నిర్మాణం వేగవంతం చేయాలని, ప్రతి ప్రభుత్వ కార్యాలయం, పాఠశాల ప్రాంగణంలో కూడా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాకు అవసరమైన మోటార్లు, పరికరాలు ముందుగానే సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

ఎరువుల కొరతపై అసత్య ప్రచారం జరగకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించేందుకు ముందస్తు ప్రణాళికతో జిల్లా యంత్రాంగం పనిచేయాలని, ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. పోలీసు శాఖ శాంతి భద్రతలతో పాటు పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం, పంటల మార్పిడిపై రైతులకు ఇప్పటికే విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది జిల్లాలో 1.85 లక్షల ఎకరాల్లో సాగు జరగగా, ఈ ఏడాది ఇప్పటివరకు 78 వేల ఎకరాల్లో మాత్రమే సాగు జరిగిందన్నారు. రైతు భరోసా పొందుతున్న రైతులందరికీ ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొబైల్ సందేశాలు పంపుతున్నామని, ఆగస్టులో సాగు చేయాల్సిన పంటలపై ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. జిల్లాకు 1,500 ఎకరాల ఆయిల్‌పామ్ లక్ష్యం ఉండగా ఇప్పటికే 400 ఎకరాల్లో సాగు పూర్తైందని, తెలంగాణ జలసిరి కింద నీటి సంరక్షణ పనులు పకడ్బందీగా కొనసాగుతున్నాయని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్‌ఓ జయశ్రీ, వేములవాడ ఆర్డీఓ కేవీఎస్‌బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల బకాయిల విడుదల

(మొదటి పేజీ తరువాయి)

దీంతో ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.6 వేల కోట్ల బకాయిల చెల్లింపు ప్రక్రియ పూర్తయింది. ప్రభుత్వం బకాయిలను మూడు విడతల్లో విడుదల చేసింది. మే 29న తొలి విడతగా రూ.2 వేల కోట్లు, జూన్ 30న రెండో విడతగా మరో రూ.2 వేల కోట్లు విడుదల చేయగా, గురువారం మూడో విడతగా మరో రూ.2 వేల కోట్లను విడుదల చేసింది. తీవ్ర ఆర్థిక పరిస్థితులు ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఈ నిర్ణయం ద్వారా మరోసారి స్పష్టమైందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం కల్పించింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలను ఈ నిధులతో పూర్తిస్థాయిలో చెల్లించినట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఎదురుచూస్తున్న ప్రధాన సమస్యల్లో ఒకటైన ఈ అంశానికి పరిష్కారం లభించడంతో లబ్ధిదారుల్లో సంతృప్తి వ్యక్తమవుతోంది. మిగిలి ఉన్న ఇతర బకాయిలను కూడా దశలవారీగా విడుదల చేసి పూర్తిగా చెల్లిస్తామని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను సమతుల్యం చేసుకుంటూనే ఉద్యోగుల హక్కులను పరిరక్షించే దిశగా ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోందని పేర్కొంది. ఉద్యోగుల సంక్షేమం విషయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపింది.

బకాయిల విడుదలతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధిని పలువురు అభినందించారు. ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వారికి ఆర్థిక ఊరట కలిగించిందని అభిప్రాయపడ్డారు. ఉద్యోగ సంఘాల నాయకులు కూడా ప్రభుత్వం ఇచ్చిన హామీని నిర్ణీత గడువులో అమలు చేయడాన్ని స్వాగతించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఇదే విధమైన సానుకూల వైఖరి కొనసాగించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం-ఉద్యోగ సంఘాల మధ్య పరస్పర విశ్వాసాన్ని ఈ నిర్ణయం మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు.

# వర్షాలపై అధికార యంత్రాంగం అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వాగులు, వంకలు, చెరువులు, జలాశయాల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో నివసించే ప్రజలను ముందుగానే అప్రమత్తం చేసి అవసరమైతే వెంటనే సురక్షిత ప్రాంతాలకు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని, ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన యంత్రాలు, సహాయక బృందాలు, వైద్య సిబ్బందిని ముందుగానే సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ట్రాఫిక్, విద్యుత్, తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నీరు నిలిచే ప్రాంతాల్లో వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సాధారణ జీవనానికి ఆటంకం కలగకుండా నగర పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

రాష్ట్రంలో నాలుగు రోజుల క్రితం వరకు సుమారు 30 శాతం మేర ఉన్న వర్షపాతం లోటు, గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో దాదాపు సాధారణ స్థాయికి చేరుకుందని మంత్రి తెలిపారు. అయితే రానున్న రెండు రోజుల్లో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు జూలై 30, 31 తేదీల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అలాగే నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించినట్లు వెల్లడించారు. ఈ జిల్లాల కలెక్టర్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన సహాయక చర్యలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.

## ముగిసిన ఉద్యమ కెరటప్రస్థానం..

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం ఉదయం 5 గంటలకు హైదరాబాద్ నుంచి ఆయన భౌతికకాయాన్ని నర్సంపేటకు తరలించనున్నారు. ఉదయం 7 గంటలకు ప్రజల సందర్శనార్థం భౌతిక కాయాన్ని ఉంచనుండగా, సాయంత్రం 3 గంటలకు నల్లబెల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మృతితో వరంగల్ రాజకీయ నేతలు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తన చిరకాల రాజకీయ సహచరుడిని కోల్పోవడం బాధాకరమని పేర్కొంటూ కన్నీటి పర్యంతమయ్యారు. రాష్ట్రంలోని పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి మృతిపై సంతాపం వ్యక్తం చేస్తున్నారు.






# ఎఫ్ఆర్‌సీ జారీలో జాప్యం

(మొదటి పేజీ తరువాయి)

వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో పడుతున్నాయి. దీంతో ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పథకం ప్రారంభమైన జూలై 27 నుంచి బుధవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల ద్వారా 50 వేలకుపైగా దరఖాస్తులు అందినట్లు అధికార వర్గాలు తెలిపాయి. అయితే తొలిరోజే దరఖాస్తు చేసిన పలువురికి కూడా ఇప్పటి వరకు ధ్రువీకరణ పత్రాలు అందకపోవడంతో వారు ప్రతిరోజూ మీసేవ కేంద్రాలకు వెళ్లి వివరాలు తెలుసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

గత నెల 25న ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 172 ప్రకారం, దరఖాస్తు అందిన రెండు పనిదినాల్లోగా సంబంధిత తహశీల్దార్లు పరిశీలన పూర్తి చేసి సర్టిఫికెట్ జారీ చేయాల్సి ఉంది. అయితే అనేక మండలాల్లో ఈ గడువు పాటించకపోవడంతో దరఖాస్తుల పరిష్కారం ఆలస్యమవుతోంది. నిర్ణీత కాలవ్యవధిలో సేవలు అందకపోవడంపై దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ రిజిస్టర్ ధ్రువీకరణ పత్రాల జారీ కోసం ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ వద్ద ఉన్న రేషన్ కార్డు సమాచారాన్ని ఆధారంగా తీసుకుని తెలంగాణ కుటుంబ రిజిస్టర్‌ను రూపొందించింది. పౌరులు మీసేవ కేంద్రంలో దరఖాస్తు సమర్పించగానే అది నేరుగా సంబంధిత తహశీల్దార్ లాగిన్‌కు చేరుతుంది. అక్కడ రేషన్ కార్డు వివరాలతో సరిపోల్చి పరిశీలించిన అనంతరం డిజిటల్ సంతకంతో ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయాల్సి ఉంటుంది.

అయితే తహశీల్దార్ల స్థాయిలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ఆశించిన వేగంతో సాగకపోవడంతో దరఖాస్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సిబ్బంది కొరత, అధిక సంఖ్యలో దరఖాస్తులు రావడం వంటి కారణాలు కూడా జాప్యానికి దారి తీస్తున్నాయని తెలుస్తోంది. ఈ పరిస్థితితో ప్రజలు పలుమార్లు కార్యాలయాలు, మీసేవ కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఎఫ్ఆర్‌సీని వివిధ ప్రభుత్వ సేవలు, పథకాల కోసం కీలక ధ్రువీకరణ పత్రంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేపథ్యంలో దాని జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, ప్రభుత్వం నిర్దేశించిన రెండు పనిదినాల గడువులోనే ధ్రువీకరణ పత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అంగన్వాడీలకు మౌలిక వసతులు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని ప్రతి అంగన్వాడీ కేంద్రంలో వంద శాతం మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇంకా పూర్తికాని మౌలిక వసతుల పనులను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, ప్రతి కేంద్రంలో ఏ పనులు పూర్తయ్యాయి, ఇంకా ఏవి పెండింగ్‌లో ఉన్నాయనే వివరాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న పోషకాహారం, వారి శారీరక ఎదుగుదలపై నమూనా సర్వే నిర్వహించాలని మంత్రి సీతక్క సూచించారు. ఆ సర్వే ఫలితాల ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని తెలిపారు. చిన్నారులకు పాలు, అల్పాహారం అందించే కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆలస్యం లేకుండా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని, ఉదయం అల్పాహారం వారి శారీరక, మానసిక వికాసానికి దోహదపడేలా ఉండాలని పేర్కొన్నారు. అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి జిల్లా వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. టీచర్లు, ఆయాల ఖాళీల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని, 16 జిల్లాల్లో ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ అయ్యాయని, మిగిలిన జిల్లాల్లో కూడా నియామక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ తొలి వారంలోగా యూనిఫాంల పంపిణీ పూర్తి చేయడంతో పాటు అంగన్వాడీ టీచర్లకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిప్లొమా సర్టిఫికెట్లు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

అంగన్వాడీ కేంద్రాలు చిన్నారులను ఆకర్షించేలా ఆహ్లాదకరమైన వాతావరణంతో ఉండాలని మంత్రి తెలిపారు. పిల్లలకు ఉత్సాహాన్ని కలిగించే రంగులతో కేంద్రాలను తీర్చిదిద్దాలని, అభ్యాసం, ఆటపాటలు, ఆరోగ్య సంరక్షణకు అనువైన వాతావరణం కల్పించాలని సూచించారు. వర్షాల సమయంలో అవసరమైతే అంగన్వాడీ కేంద్రాలను తాత్కాలికంగా సురక్షిత ప్రాంతాలకు మార్చి చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. బస్టాండ్లు వంటి రద్దీ ప్రాంతాల్లో తల్లులు పిల్లలకు పాలిచ్చేందుకు ఇప్పటికే ఏర్పాటు చేసిన 54 తల్లి ఒడి కేంద్రాల తరహాలో అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి జిల్లాలో దత్తత కేంద్రాల ఏర్పాటును వేగవంతం చేయాలని, ప్రస్తుతం ఉన్న 17 కేంద్రాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. తెలంగాణను బాల్య వివాహాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్థాయి నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా పూర్తిస్థాయిలో వినియోగించాలని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా సంక్షేమ అధికారులు హాస్టళ్లు, అంగన్వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించి సమస్యలపై నివేదికలు సమర్పించాలని మంత్రి ఆదేశించారు.

# పామిడిరెడ్డిపల్లిలో ఓటరు దరఖాస్తుల ప్రక్రియ విజయవంతం



**పెద్దమందడి,జూలై30(తెలంగాణ ముచ్చట్లు):** ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిడిరెడ్డిపల్లి గ్రామానికి సంబంధించిన ఓటరు దరఖాస్తులను బూత్‌వారీగా 100% శాతం పూర్తి చేసిన బి ఎల్ ఓలు, బి ఎల్ ఏ-2లను ఘనంగా సన్మానించారు.వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ పెద్దమందడి మండల అధ్యక్షులు కొమ్ము వెంకటస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఓటరు దరఖాస్తులను నూరు శాతం డిజిటలీకరణ చేసేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఓటర్ల వివరాల నమోదు, దరఖాస్తుల పరిశీలన, డిజిటలీకరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో బి ఎల్ ఓలు, బి ఎల్ ఏ-2లు కీలక పాత్ర పోషించారని కొమ్ము వెంకటస్వామి పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేసిన వారందరినీ అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మధిర మంజుల-శ్రీశైలం, మాజీ ఎంపీటీసీ ఇంద్ర లక్ష్మారెడ్డి, బూత్ స్థాయి అధికారులు సునీత, లక్ష్మి, భాగ్యలక్ష్మి, శారద, బి ఎల్ ఏ-2లు కొంకలి నర్సింహా, వెంకటయ్య, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



- **సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్**

**పెద్దమందడి,జులై30(తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మనిగిల్ల గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం ఉదయం మార్నింగ్ వాక్ సందర్భంగా గ్రామంలోని పలు వార్డుల్లో పర్యటించిన ఆయన ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గ్రామంలో డ్రైనేజీలను దాటేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన సర్పంచ్, ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీలపై స్లాబులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం గ్రామంలో సుమారు 15 నుంచి 20 ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. స్లాబుల ఏర్పాటు పనులను శుక్రవారం నుంచి ప్రారంభిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.అనంతరం వర్షాభావ పరిస్థితులు, నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని, వాడిన నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో నీటి నిల్వలు పెరిగి భూగర్భ జలాలు వృద్ధి చెందాలంటే ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని కోరారు.గ్రామంలో సామాజిక ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణానికి కూడా చర్యలు చేపడుతున్నట్లు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఇందుకోసం గ్రామంలో ఐదు ప్రాంతాలను గుర్తించామని, త్వరలో సంబంధిత పనులను ప్రారంభిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముప్పూరు గణేష్ కుమార్, మద్దిరాల శ్రీకాంత్ రెడ్డి, మల్లికార్జున్, ముప్పూరి రాములు, బుచ్చయ్య, ముప్పూరు కొండన్న, కుర్మయ్య, సాయికుమార్, వై. బాలకృష్ణ, రమేష్, రాజు, సాయిలు, ఆనంద్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# పదోన్నతి ఉద్యోగులకు కొత్త ఉత్సాహం



- **హెడ్ కానిస్టేబుల్ రాజగౌడ్‌కు ఘన సన్మానం**

**వనపర్తి,జులై30(తెలంగాణ ముచ్చట్లు):** ప్రతి ఉద్యోగి జీవితంలో పదోన్నతి కొత్త ఉత్సాహాన్ని, ప్రేరణను కలిగిస్తుందని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు.ఇరవై ఏళ్లకు పైగా పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రాజగౌడ్‌కు ఇటీవల హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి లభించిన సందర్భంగా సాహితీ కళా వేదిక సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక రేడియంట్ హై స్కూల్‌లో కళా వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజగౌడ్‌ను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో నిబద్ధత, అంకితభావంతో పనిచేయడం, తోటి ఉద్యోగులతో స్నేహపూర్వకంగా మెలగడం రాజగౌడ్ గొప్ప వ్యక్తిత్వానికి నిదర్శనమని కొనియాడారు. తన సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో పీఆర్‌వోగా సేవలందించడమే కాకుండా, అనేక సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల ప్రశంసలు అందుకున్నారని తెలిపారు.కార్యక్రమంలో కళా వేదిక ప్రతినిధులు బైరోజు చంద్రశేఖర్, దేశి రాములు యాదవ్, బండారు శ్రీనివాస్, రాజేంద్రచారి, మద్దిలేటి, రమేష్, కృష్ణవేణి, శోభ, నుస్రత్ తబస్సుమ్, శైలజ, పుష్పలత, హేమలత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.కావాలంటే దీనిని ఇంకా పత్రికా వార్తకు తగ్గట్లుగా సంక్షిప్తంగా లేదా మరింత ఆకర్షణీయమైన హెడ్డింగ్‌తో కూడా మార్చగలను.

# రైతులు నీటి నిల్వకుంటలు ఏర్పాటు చేసుకోవాలి

- **పెద్దమందడి ఎంపీడీవో పరిణత**



**పెద్దమందడి,జూలై30(తెలంగాణ ముచ్చట్లు):** కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు తమ వ్యవసాయ భూముల్లో నీటి నిల్వకుంటలను ఏర్పాటు చేసుకోవాలని వనపర్తి జిల్లా పెద్దమందడి ఎంపీడీవో పరిణత సూచించారు. పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో రైతులకు నీటి సంరక్షణ, పంట మార్పిడి విధానాలపై అవగాహన కల్పించారు.వర్షాకాలంలో కురిసే నీటిని వృథా కాకుండా నిల్వ చేసుకునేందుకు రైతులు తమ పొలాల్లో నీటి నిల్వకుంటలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. నీటి నిల్వకుంటల్లో వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా నీటి కొరత సమయంలో పంటలకు అవసరమైన నీటిని అందించవచ్చని వివరించారు. జలసిరి పథకంలో భాగంగా 20×20 పరిమాణంలో నీటి నిల్వకుంటలను ఏర్పాటు చేసుకోవడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. నీటి నిల్వకుంటల ఏర్పాటు ద్వారా భూగర్భ జలాల పెరుగుదలకు దోహదపడటంతో పాటు, పశువులకు నీటి సౌకర్యం కల్పించవచ్చన్నారు.ప్రస్తుత కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి పంటపైనే ఆధారపడకుండా, తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. పంట మార్పిడి విధానాన్ని అనుసరించడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవడంతో పాటు సాగు వ్యయాన్ని కూడా నియంత్రించవచ్చని తెలిపారు.రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ, నీటి పొదుపు పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో పరిణత కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మల్లికార్జున్, మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి, గ్రామ సర్పంచ్ అశోక్, ఐకెపి సిబ్బంది, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రాగమయి ప్రత్యేక దృష్టి.. ఎస్ఐఆర్‌లో సత్తుపల్లికి గుర్తింపు

- **ఖమ్మం జిల్లాలో రెండో స్థానంలో నిలిచిన నియోజకవర్గం.**
- **వేంసూరు మండలానికి ప్రథమ స్థానం.**
- **అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏల సమిష్టి కృషికి ఫలితం.**




**సత్తుపల్లి, జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం అమలులో సత్తుపల్లి నియోజకవర్గం ఖమ్మం జిల్లా వ్యాప్తంగా రెండో స్థానాన్ని దక్కించుకోగా, నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ప్రత్యేక దృష్టి సారించి చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, అధికారులతో నిరంతర సమన్వయం, ఎప్పటికప్పుడు నిర్వహించిన సమీక్షల ఫలితంగానే ఈ ఘనత సాధ్యమైందని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు రెవెన్యూ అధికారులకు అవసరమైన సూచనలు, మార్గనిర్దేశనం అందించారు. ఎంఆర్ఓ పర్యవేక్షణలో రెవెన్యూ అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేస్తూ ఇంటింటికీ వెళ్లి నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. అర్హత కలిగిన ఏ ఓటరూ నమోదు ప్రక్రియకు దూరం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ విజయానికి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ నాయకత్వంతో పాటు ఎంఆర్ఓ సమర్థ పర్యవేక్షణ, రెవెన్యూ అధికారుల కృషి, బీఎల్ఓలు, బీఎల్ఏల అంకితభావం ప్రధాన కారణమని పేర్కొన్నారు. అలాగే సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమా ఆనంద్‌బాబు, వేంసూరు గ్రామ సర్పంచ్ ఎం.డి. ఫక్రుద్దీన్ అందించిన సహకారం, ప్రోత్సాహం కూడా కార్యక్రమం విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించిందని కొనియాడారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములైన ఎంఆర్ఓ, రెవెన్యూ అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులు, అలాగే నమోదు ప్రక్రియలో చురుకుగా పాల్గొన్న ప్రతి ఓటరికి ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# వెల్టూర్ లో బీఎల్ఓల కృషి,ప్రజల సహకారంతో ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం

- **బీఎల్ఓలు అభినందించిన మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి**



**పెద్దమందడి,జులై30(తెలంగాణ ముచ్చట్లు):** బీఎల్ఓల అంకితభావం, నిరంతర కృషి, గ్రామ ప్రజల సంపూర్ణ సహకారంతో వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం విజయవంతంగా పూర్తి చేసినట్లు పెద్దమందడి మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి కృషి చేసిన బీఎల్ఓలను, వారికి ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన అధికారి కరుణతో పాటు ఈ ప్రక్రియలో భాగస్వాములైన అధికార యంత్రాంగాన్ని రఘుపతి రెడ్డి ఆధ్వర్యంలో, గ్రామ సర్పంచ్ అశోక్ సమక్షంలో ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా రఘుపతి రెడ్డి మాట్లాడుతూ.. వెల్టూర్ గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియ 100 శాతం పూర్తికావడం ఆనందంగా ఉంది. గ్రామ ప్రజల సహకారంతో పాటు బీఎల్ఓలు, అధికారి కరుణ, అధికార యంత్రాంగం బాధ్యతాయుతంగా, నిబద్ధతతో పనిచేయడం వల్లే ఈ విజయం సాధ్యమైంది అని పేర్కొన్నారు.ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవసరమైన సమాచారం అందిస్తూ, ప్రక్రియను సకాలంలో పూర్తి చేయడంలో బీఎల్ఓలు కీలక పాత్ర పోషించారని అన్నారు. వారికి సమర్థవంతంగా మార్గనిర్దేశం చేసి, ప్రక్రియను సమన్వయం చేసిన అధికారి కరుణ సేవలు అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పెద్దమందడి తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో పరిణత, బీఎల్ఓలు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.





# అర్హులకు అన్యాయం.. ప్రీ-ప్రైమరీ నియామకాలపై విచారణ జరపాలి

- **కలెక్టర్‌కు బీఆర్ఎస్ వినతి.**
- **అవసరమైతే హైకోర్టును ఆశ్రయిస్తామని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య హెచ్చరిక.**

**సత్తుపల్లి, జూలై 30(తెలంగాణ ముచ్చట్లు):** జిల్లాలో ఇటీవల నిర్వహించిన ప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల నియామక ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు గురువారం జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. బాధిత అభ్యర్థులతో కలిసి కలెక్టరేట్‌కు చేరుకున్న నాయకులు నియామకాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ.. అర్హత, ప్రతిభ ఉన్న అభ్యర్థులను పక్కనబెట్టి నియామక ప్రక్రియను అక్రమాలకు వేదికగా మార్చారని ఆరోపించారు. మొత్తం నియామక ప్రక్రియపై ఉన్నతస్థాయి విచారణ జరిపించి, అవకతవకలకు పాల్పడిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా నియామకాలను పారదర్శకంగా పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని సండ్ర వెంకట వీరయ్య భరోసా ఇచ్చారు. న్యాయం జరగకపోతే హైకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో మాజీ మండల, నగర పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, భాషబోయిన వీరన్న, నాయకులు బిచ్చాల తిరుమలరావు, బత్తుల మురళి, ఇతర బీఆర్ఎస్ నాయకులు, బాధిత అభ్యర్థులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రోగులకు అమ్మలా.. సేవల్లో ఆదర్శంగా నిలిచిన ఎవాంజెలిన్



**వనపర్తి,జూలై30(తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి -వనపర్తి జిల్లా కేంద్రంలో హెడ్ నర్స్ చీఫ్‌గా 40 సంవత్సరాల పాటు విశిష్ట సేవలు అందించిన యు. ఎవాంజిలిన్ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ పాల్గొని ఆమెను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ..ఎవాంజిలిన్ ఎంతోమంది రోగులకు తల్లిలా సేవ చేశారని, రాత్రింబవళ్లు రోగుల సంరక్షణ కోసం ఆమె చేసిన కృషి అమూల్యమని కొనియాడారు. ఒక నర్సుగా మాత్రమే కాకుండా, తల్లిగా, గురువుగా జూనియర్ నర్సులకు మార్గనిర్దేశం చేశారని తెలిపారు. ఆమె క్రమశిక్షణ, అంకితభావం, మానవత్వం అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డా. బండారు శ్రీనివాస్, సామాజికవేత్త గంధం నాగరాజు, ప్రొఫెసర్ డాక్టర్ చంద్రమోహన్, ప్రొఫెసర్ డాక్టర్ శివప్రసాద్, వైద్యులు, నర్సులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వర్షా కాలంలో అప్రమత్తంగా ఉండాలి



- **ప్రజలకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ సూచన.**

**జమ్మికుంట టౌన్, జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ సూచించారు. గురువారం పట్టణంలోని నాలుగో వార్డులో వర్షపు నీరు సజావుగా వెళ్లేలా మున్సిపల్ శానిటేషన్ బృందాలు చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. వర్షాకాలంలో తాగునీటిని తప్పనిసరిగా గోరువెచ్చగా చేసి తాగాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. నిర్లక్ష్యం వహిస్తే వైరల్ జ్వరాలు, నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు సోకే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

పట్టణంలో ఎక్కడా వర్షపు నీరు నిల్వ ఉండకుండా మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది నిరంతరం పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ప్రజలు కూడా పారిశుద్ధ్య పరిరక్షణలో భాగస్వాములై మున్సిపాలిటీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో నాలుగో వార్డు కౌన్సిలర్ పోల్నేని అజయ్ రావు, మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జమ్మికుంట నాయకుల ఘన సత్కారం



**జమ్మికుంట టౌన్ జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ బస్టాండ్‌లో నగర లోకల్ బస్సుల సేవలను ప్రారంభించిన రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జమ్మికుంటకు చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం, కోరపల్లి మాజీ సర్పంచ్ బోయిని సమ్మయ్య, జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అంబాల రాజు మంత్రికి శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ప్రజలకు మరింత మెరుగైన రవాణా సేవలు అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వారు అభినందించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాడి పశువుల సంరక్షణ–పాల ఉత్పాదకత పెంపుపై రైతులకు అవగాహన శిక్షణ





**భీమదేవరపల్లి, జూలై 30(తెలంగాణ ముచ్చట్లు):** పాడి రైతులకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించి పాల ఉత్పాదకతను పెంచడంతో పాటు రైతుల ఆదాయాన్ని వృద్ధి చేయాలనే లక్ష్యంతో "పాడి పశువుల సంరక్షణ మరియు పాల ఉత్పాదకత పెంపు" అంశంపై శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. వై. రాధాకృష్ణ, సహాయ సంచాలకులు డా. ఎన్. సత్యప్రసాద్ రెడ్డి, డా. రఘుబాబు, స్థానిక పశువైద్యులు ముఖ్య అతిథులుగా హాజరై రైతులకు శాస్త్రీయ సూచనలు అందించారు. సంఘ జనరల్ మేనేజర్ ఎం. రాం రెడ్డి, సంఘ కార్యవర్గ సభ్యులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

శిక్షణలో భాగంగా డా. జె. రవికుమార్ గడ్డి రకాలు, పాడి పశువుల పోషణపై, డా. రాజన్న పాడి పశువుల పెంపకం, యాజమాన్య పద్ధతులపై, డా. రాజబాబు దూడల సంరక్షణ ప్రాధాన్యతపై, డా. రాజి రెడ్డి గర్భకోశ సంబంధిత సమస్యలు, నివారణ, చికిత్సపై రైతులకు సమగ్ర అవగాహనకల్పించారు. అదేవిధంగా ఉత్తమ జాతుల ఎంపిక, ఆరోగ్యవంతమైన పాడి పశువుల నిర్వహణ, పశువుల కొట్టాల నిర్మాణ ప్రమాణాలు, సమతుల్య దాణా, పాల ఉత్పాదకత పెంపు, దూడల సంరక్షణ, చిన్న వయసు పశువుల పెంపకం, పునరుత్పత్తి సంబంధిత వ్యాధుల నివారణ వంటి అంశాలపై నిపుణులు వివరించారు.

ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ, ఆధునిక శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా రైతులు ఒక్కో పాడి పశువు నుంచి అధిక పాల ఉత్పత్తి సాధించి ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. శిక్షణలో అందించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆచరణలో పెట్టడం ద్వారా పాడి పరిశ్రమను మరింత లాభదాయకంగా మార్చుకోవచ్చని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న రైతులు నిపుణులు అందించిన సూచనలపై ఆసక్తి కనబరిచి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# కనగర్తిలో ఉచిత వైద్య శిబిరం.. ఆరోగ్యంపై అవగాహన






**ఇల్లంతకుంట, జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చని కనగర్తి గ్రామ సర్పంచ్ రామంచ సంపత్ అన్నారు.

గురువారం బాలవికాస ఆధ్వర్యంలో, హనుమకొండ లక్ష్మీ నరసింహ హాస్పిటల్ సౌజన్యంతో గ్రామపంచాయతీ ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆరోగ్య పరిరక్షణలో పరిశుభ్రతతో పాటు సమతుల్య ఆహారం కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.

అనంతరం డాక్టర్లు తేజస్విని, సంకీర్తన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్రతి ఒక్కరూ కనీసం ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ముఖ్యంగా యుక్తవయసు బాలికలు రక్తహీనతకు గురికాకుండా పోషక విలువలు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.

శిబిరంలో బాలవికాస కోఆర్డినేటర్లు కే. సుమలత, ఏ. స్వాతి, ఆసియా, గ్రామ కార్యదర్శి క్రాంతికుమార్, తాళ్లపల్లి శ్రీను, బాలవికాస విలేజ్ లీడర్ కవిత, లక్ష్మీ నరసింహ హాస్పిటల్ పీఆర్‌వోలు బిక్షపతి, సంపత్ రెడ్డి, రాజేష్, సిబ్బంది ప్రసన్న, భారతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన పలువురు ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకుని ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు.

# తెలంగాణ జలసిరి పథకంపై రైతులకు అవగాహన



**వీణవంక, జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు-):** భూగర్భ జలాల పరిరక్షణ, వర్షపు నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, నీటి వనరులను కాపాడితేనే భవిష్యత్ తరాలకు నీటి భద్రత సాధ్యమవుతుందని డీఆర్డీవో మచ్చ గీత అన్నారు.

గురువారం వీణవంక మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో తెలంగాణ జలసిరి పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ జలసిరి పథకం ద్వారా భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి నిల్వ, సాగునీటి సమర్థ వినియోగానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఇంకుడు గుంతలు, ఫార్మ్ పాండ్లు, పెర్కొలేషన్ ట్యాంకులు, చెక్‌డ్యాంలు, రీఛార్జ్ షాఫ్టులు వంటి నీటి సంరక్షణ నిర్మాణాలను విస్తృతంగా ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలమట్టం పెరుగుతుందని, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టే చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

సదస్సులో సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని జల సంరక్షణ చర్యలపై చర్చించారు.

# హుస్నాబాద్‌లో ట్రాఫిక్ అవుట్‌పోస్ట్ ప్రారంభం

- **ట్రాఫిక్ నిర్వహణకు కొత్త మైలురాయి**
- **ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమన్న పోలీసు కమిషనర్**
- **రహదారి నిబంధనలు పాటించాలని సూచన**
- **హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని విజ్ఞప్తి**




**సిద్దిపేట, జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):** సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలోని హుస్నాబాద్‌లో నూతన ట్రాఫిక్ అవుట్‌పోస్ట్‌ను పోలీసు కమిషనర్ రష్మి పెరుమాళ్ ప్రారంభించారు. ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజల భద్రతను బలోపేతం చేసే దిశగా ఈ అవుట్‌పోస్ట్ కీలకంగా మారనుందని అధికారులు తెలిపారు. నూతన ట్రాఫిక్ అవుట్‌పోస్ట్ ప్రారంభంతో హుస్నాబాద్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, రద్దీ ప్రాంతాల పర్యవేక్షణ, రహదారి భద్రత చర్యలు మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి అవకాశం ఏర్పడుతుందని పోలీసు అధికారులు పేర్కొన్నారు. ప్రమాదాలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ రష్మి పెరుమాళ్ మాట్లాడుతూ రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిర్లక్ష్యంగా వాహనాలు నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సహకారంతోనే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. హెల్మెట్ వినియోగం ప్రాణాలను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తుందని, చిన్న నిర్లక్ష్యం కూడా తీవ్ర ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. వాహనదారులు తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకుని ప్రయాణించాలని సూచించారు.

ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి ప్రజల్లో రహదారి భద్రతపై చైతన్యం పెంపొందించేందుకు పోలీసు శాఖ చర్యలు కొనసాగిస్తోందని అధికారులు తెలిపారు. విద్యార్థులు, యువత, వాహనదారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ నూతన ట్రాఫిక్ అవుట్‌పోస్ట్ ద్వారా ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలకు వేగవంతమైన సేవలు, రహదారి భద్రత చర్యలు మరింత మెరుగుపడనున్నాయని పోలీసు శాఖ అభిప్రాయపడింది. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక





# పేదల ఇళ్లే.. ప్రజా పాలన మార్క్! : మంత్రి పొంగులేటి

- **అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు.. రాష్ట్రంలో గుడిసెలే ఉండకూడదనేదే మా సంకల్పం**
- **రూ.1.25 కోట్లతో చంద్రుగొండ మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి**
- **మహిళల సాధికారతకు రూ.70 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చి ప్రాధాన్యం ఇచ్చామని వెల్లడి**

**ఖమ్మం బ్యూరో, జులై 30(తెలంగాణ ముచ్చట్లు):** ప్రజల ఇంటి గుమ్మం వద్దకే సంక్షేమ పథకాలను చేరవేసి, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవడమే తమ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలో రూ.1.25 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపనలు చేశారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌లతో కలిసి మంగయ్యబంజార, పొకలగూడెం, రావికంపాడు గ్రామాల్లో మంత్రి విస్తృతంగా పర్యటించారు.

పూరి గుడిసెలు లేని తెలంగాణగా తీర్చిదిద్దుతాం

పొకలగూడెం వేదికగా జరిగిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఒక్క పేద కుటుంబం కూడా పూరి గుడిసెలో నివసించకూడదనే ధ్యేయంతో ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా రెండు విడతల్లో మొత్తం 7 లక్షల ఇందిరమ్మ గృహాల నిర్మాణాన్ని చేపట్టామని, ఒక్క రాజధాని హైదరాబాద్‌లోనే ప్రత్యేకంగా లక్ష ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. గత ప్రభుత్వం రూ.8.21 లక్షల కోట్ల అప్పుల భారం నెత్తిపై పెట్టినప్పటికీ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు.

ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే ఏకంగా 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, ఇటీవలే మరో 16 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగులకు భరోసా కల్పించామన్నారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం రూ.70 వేల కోట్ల వడ్డీలేని రుణాలను అందించామన్నారు. ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, అర్హులకు కొత్త రేషన్ కార్డులతో పాటు నాణ్యమైన సన్నబియ్యాన్ని అందిస్తూ పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని వివరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

మండలంలోని మంగయ్యబంజార గ్రామంలో రూ.45 లక్షలతో చేపట్టే గ్రావెల్ రోడ్డు, కల్వర్టు, సీసీ రోడ్డు, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి కొత్తగా 24 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం పొకలగూడెంలో రూ.60 లక్షల వ్యయంతో నాలుగు అంతర్గత సీసీ రోడ్ల పనులను ప్రారంభించి, ఈ గ్రామానికి ఇప్పటికే 77 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని తెలిపారు. రావికంపాడులో రూ.20 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మిగిలిన అంతర్గత రహదారులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీవో మధు, చంద్రుగొండ తహసిల్దార్ జగదీశ్వర ప్రసాద్, డీపీఓ అనూష, గృహనిర్మాణ శాఖ పీడీతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# హరితోత్సవంతో పచ్చని సందేశం

- **పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా వార్డుల వారీగా మొక్కల పంపిణీ**

**హుజూరాబాద్, జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):** హుజూరాబాద్ పట్టణంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వార్డుల్లో మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్‌రావు పాల్గొని ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి సమస్యలను అధిగమించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ప్రతి ఇంటా కనీసం ఒక మొక్కను నాటి దానిని పెంచితేనే భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమని పేర్కొన్నారు.

ప్రభుత్వం చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని, మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె కోరారు. హుజూరాబాద్‌ను మరింత పచ్చదనంతో నింపే దిశగా మున్సిపాలిటీ నిరంతరం హరిత కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ప్రజలు తమ ఇళ్ల వద్ద, కాలనీల్లో మొక్కలు నాటి సంరక్షిస్తామని సంకల్పం వ్యక్తం చేశారు. వనమహోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ మొక్కల పంపిణీ కార్యక్రమం ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంలో విశేషంగా దోహదపడింది.



# వానలతో రైతన్నలో మళ్లీ చిగురించిన ఆశలు

## వర్షాలతో పొలాల బాట పట్టిన అన్నదాతలు

**హుజురాబాద్ , జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):** ఎట్టకేలకు వరుణుడు కరుణించడంతో రైతన్నలో మళ్లీ ఆశలు చిగురించాయి. జూన్, జూలై నెలలుగా వర్షాల కోసం ఎదురుచూస్తూ ఆందోళనలో ఉన్న రైతులకు మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న ఎడతెరిపి వర్షాలు కొత్త ఉత్సాహాన్ని నింపాయి. వర్షాలు సమృద్ధిగా కురవడంతో నేల తడిసి సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడటంతో రైతులు పొలాల బాట పట్టారు.

ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటల సాగు ఆలస్యమైంది. విత్తనాలు సిద్ధంగా ఉంచుకున్న రైతులు వర్షాభావం కారణంగా సాగు ప్రారంభించలేక తీవ్ర నిరాశకు గురయ్యారు. కొంతమంది రైతులు ఇప్పటికే దున్నిన పొలాలు కూడా ఎండిపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు.

అయితే మంగళవారం సాయంత్రం నుంచి ప్రారంభమైన వర్షాలు రాత్రంతా కొనసాగడంతో పరిస్థితి పూర్తిగా మారింది. పొలాల్లో తగినంత తేమ ఏర్పడటంతో రైతులు ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలతో తెల్లవారుజామునే పొలాల్లోకి వెళ్లి విత్తనాలు వేసే పనులను ప్రారంభించారు. వరి, మొక్కజొన్న, పత్తి సాగు పనులు వేగం పుంజుకోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో సందడి నెలకొంది.

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మరికొన్ని రోజులు కొనసాగితే ఖరీఫ్ సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు పంటలు కూడా ఆశించిన మేర దిగుబడులు ఇస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వరుణుడి కరుణతో ఈ సీజన్‌లో మంచి పంటలు పండాలని అన్నదాతలు ఆకాంక్షిస్తున్నారు.

# మానవ అక్రమ రవాణా నివారణ అవగాహన ద్వారానే సాధ్యం

**ఇన్స్పెక్టర్ శివనాదుల శ్రీనివాస్**

**ఖమ్మం బ్యూరో, జులై 30(తెలంగాణ ముచ్చట్లు ):** మానవ అక్రమ రవాణాను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే అవగాహన ద్వారానే సాధ్యమవుతుందని షీ టీం మరియు యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ ఇన్స్పెక్టర్ శివ నాదుల శ్రీనివాస్ అన్నారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం జూలై 30 సందర్భంగా యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ మరియు పోలీస్ యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా మొత్తం బాధితులలో 26% మంది పిల్లలే అని 71 శాతం మంది మహిళలు మరియు యుక్త వయసు బాలికలు అని ఆందోళన వ్యక్తం చేశారు నిరుద్యోగులు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు ఉపాధి కోసం వలస వెళ్లేవారు కూడా అత్యంత ఎక్కువ ప్రమాదం లో ఉంటారని గ్రామాలలో పాఠశాలలో కమ్యూనిటీ మీటింగ్లలో ఈ అంశంపై విస్తృతంగా ప్రచారం చేయాలని చర్చలు నిర్వహించాలని అన్నారు మానవ అక్రమ రవాణా ఈ విధంగా జరుగుతుందో ఎలా అప్రమత్తంగా ఉండాలో చిన్న చిన్న స్కిట్ ల ద్వారా ఆయన బాలబాలికలను ఉత్తేజపరిచారు . ఆన్లైన్ మోసాలు వేధింపులు మరియు ఇతర సమస్యలకు డైల్ 100 లేదా 1930లకు ఫోన్ చేసి తెలిపి సహాయం పొందాలని అన్నారు. మరో అతిథి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ సురేష్ గౌడ్ మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాలబాలికలు సామాజిక మాధ్యమాలను విరివిగా వినియోగిస్తూ తమ యొక్క విలువైన సమయాన్ని వృధా చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమయాన్ని సద్వినియోగం చేసుకొని సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల యొక్క ఆకాంక్షలను అర్థం చేసుకొని చక్కగా చదివి జీవితంలో రాణించాలని పిలుపునిచ్చారు. మరో అతిథి బాలల సంక్షేమ కమిటీ చైర్పర్సన్ భారతరాణి మాట్లాడుతూ విద్య ద్వారానే ఏదైనా సాధించవచ్చని సమాజంలో మంచి పౌరులుగా రాణించి ఉన్నత వ్యక్తిత్వం కలిగిన బాధ్యత గల పౌరులుగా విద్య మాత్రమే తీర్చిదిద్దుతుందని తెలిపారు బాలల సంక్షేమ కమిటీ ద్వారా బాలలకు అందించే సేవలు గురించి వివరించారు ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఫోన్ చేసి తెలపాలన్నారు




ఏఐడీ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ 2013 నుంచి ఐక్యరాజ్యసమితి జులై 30 ని మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం గా జరుగుతుందని అన్నారు. మానవ క్రమ రవాణా అనేది ప్రస్తుతం స్కాముల ద్వారా కూడా జరుగుతుందని ఆ ట్రాప్ లో ఎవరూ పడవద్దని తెలిపారు అక్రమ రవాణాకు గురైన వ్యక్తులతో పారిశ్రామిక స్థాయి సైబర్ మోసాలతో ముడిపడి ఉంటుందని నకిలీ ఉద్యోగ ఆఫర్లు నేరపూరిత బృందాలు తప్పుడు విదేశీ ఉద్యోగ ప్రకటనల ద్వారా మోసం చేస్తారని రిప్టో కరెన్సీ మరియు ఇతర స్కామ్లలో నెట్టివేయబడతారని అన్నారు మానవక్రమ రవాణా ప్రతి సంవత్సరము 236 బిలియన్ డాలర్ల వ్యాపారం జరుగుతుందంటే తీవ్రతను అర్థం చేసుకోవాలని అన్నారు అక్రమ రవాణా బాధితులలో 38 శాతం మంది బాలలు ఉన్నారని కావున ప్రతి క్షణం అప్రమత్తంగా ఉంటూ అనుమానాస్పదంగా ఉంటే పోలీసు వారికి తెలియజేయాలని కోరారు

ఈ కార్యక్రమంలో ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె శ్రీనివాస్ ఏ హెచ్ టి యు సభ్యులు భాస్కర్ ,షీ టీం కానిస్టేబుల్ రుక్మిణి, సభ్యులు రాందాస్ రవిచంద్ర రవీంద్ర భాస్కర్, పారాలిగల్ వాలంటీరు మాధవి లత నయా బజార్ జూనియర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# పూరిగుడిసెలు లేని తెలంగాణయే లక్ష్యం

- **అన్నపురెడ్డిపల్లిలో రూ.2.77 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన**
- **ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశాల్లో పాల్గొన్న మంత్రి**
- **సీతారామ నిర్వాసితుల సమస్యలు వారంలోగా తేల్చాలని అధికారులకు స్పష్టమైన ఆదేశం**

**ఖమ్మం బ్యూరో, జులై 30(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రజా సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, తెలంగాణలో పూరిగుడిసెలు లేని పేదరికరహిత సమాజాన్ని నిర్మించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన సంకల్పమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్‌లతో కలిసి రూ.2.77 కోట్లకు పైగా అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు.

మౌలిక వసతుల కల్పనకు రూ.2.77 కోట్లు

గ్రామీణ ప్రాంతాల సమగ్ర వికాసానికి, మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యమిస్తోందని మంత్రి పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా గుంపెన గ్రామంలో రూ.45 లక్షలతో 9 అంతర్గత సీసీ రోడ్ల పనులకు, నరసాపురంలో ఉపాధి హామీ నిధులు రూ.117.30 లక్షలతో సీసీ రోడ్లు మరియు కల్వర్టుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. భీమునిగూడెంలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఆయన, కోండాయిగూడెం డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో రూ.20 లక్షలతో, పెద్దిరెడ్డిగూడెంలో రూ.75.50 లక్షలతో చేపట్టే రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంట గృహప్రవేశాల కోలాహలం

అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ మహోత్సవాల్లో మంత్రి స్వయంగా పాల్గొన్నారు. పెద్దిరెడ్డిగూడెంలో అగ్గి రాజమ్మ, గుంపెనలో మాయారా వసంత, భీమునిగూడెంలో వాడే సుజాత, నరసాపురంలో తిరుమలదేవి అనిత, చీపుడు జ్యోతి, ఊటుపల్లిలో మొల్లచవుకు కవిత, రంగాపురంలో వేముల కృష్ణయ్య, పెనుగొండ కోటమ్మల నూతన గృహాల్లో అడుగుపెట్టి వారికి శుభాకాంక్షలు అందజేశారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతాయని, అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

వారంలోగా సీతారామ నిర్వాసితుల సమస్యల పరిష్కారం

ప్రాజెక్టు భూనిర్వాసితుల సమస్యలపై స్పందించిన మంత్రి పొంగులేటి, సీతారామ ప్రాజెక్టు బాధితుల సమస్యలను ప్రాధాన్యతతో పరిశీలించి వారం రోజుల్లోగా పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీవో మధు, హౌసింగ్ పీడీ, జిల్లా పంచాయతీ అధికారి అనూష, తాసిల్దార్, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.







# అభివృద్ధి బాటలో చంద్రుగొండ–అన్నపురెడ్డిపల్లి

- **రూ.1.25 కోట్ల పనులకు శ్రీకారం.**
- **ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలతో సందడి.**

**అశ్వారావుపేట, జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):** అశ్వారావుపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార–పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి గురువారం చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించి రూ.1.25 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందజేసి గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చంద్రుగొండ మండలంలోని మంగయ్యబంజార గ్రామంలో రూ.45 లక్షలతో గ్రావెల్ రోడ్డు, కల్వర్టు, సీసీ రోడ్డు, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదే సందర్భంగా గ్రామానికి అదనంగా 24 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. పోకలగూడెంలో రూ.60 లక్షలతో నిర్మించిన నాలుగు అంతర్గత సీసీ రోడ్లను ప్రారంభించగా, రావికంపాడులో రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం అన్నపురెడ్డిపల్లి మండలంలోని భీమునిగూడెం గ్రామంలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయ భవనం, సీసీ రోడ్లు, లోలెవల్ కాజ్వేను ప్రారంభించారు. కొత్తూరు, నర్సాపురం, ఎర్రగుంట గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయగా, ఊటుపల్లి, రాజాపురం గ్రామాలతో పాటు పలు ప్రాంతాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ సంక్షేమాన్ని ప్రజల గడపకు చేర్చుతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, రైతు రుణమాఫీ, రూ.500 బోనస్ వంటి పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించి అశ్వారావుపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, పేదల అభ్యున్నతే ప్రజా ప్రభుత్వ ధ్యేయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మిగిలిన అంతర్గత రహదారులు, ఇతర అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథాలయ సంస్థ చైర్మన్ విర్రబాబు, మున్సిపల్ చైర్మన్ జూపల్లి రమేష్‌బాబు, జిల్లా ఉన్నతాధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.








# ధరణి అక్రమాలపై ఉక్కుపాదం.. బాధ్యులపై కఠిన చర్యలు!

- **ధరణి మోసాల వెనుక ఉన్న నిజాలు త్వరలోనే బయటపెడతాం : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
- **పేదల భూములు కాజేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు అని ప్రకటన**

**ఖమ్మం బ్యూరో, జులై 30(తెలంగాణ ముచ్చట్లు ):** ధరణి పోర్టల్ ద్వారా జరిగిన భూ అక్రమాలను సమూలంగా వెలికితీసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. గురువారం కల్లూరులోని డీఎన్‌పీ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన సత్తుపల్లి క్లస్టర్ ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని, ప్రజల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించారు.

ధరణి అక్రమాలు బాహ్య ప్రపంచానికి వెల్లడిస్తాం

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ధరణి వ్యవస్థను ఆసరాగా చేసుకుని అనేక అక్రమాలు, భూముల మళ్లింపులు, ప్రభుత్వ భూముల అక్రమ బదిలీలు జరిగాయని తెలిపారు. పేదల భూములను ఎలా కాజేశారో సమగ్ర విచారణ ద్వారా ఆధారాలతో సహా త్వరలోనే ప్రజల ముందుకు తెస్తామన్నారు. ఎంతటి వారైనా సరే తప్పు చేసిన వారిని వదిలిపెట్టేది లేదని, కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు.

50 ఏళ్ల రెవెన్యూ సమస్యలకు పరిష్కారం

సత్తుపల్లి, కల్లూరు ప్రాంతాల్లో గత 50 ఏళ్లుగా నలుగుతున్న భూ సమస్యలను సమగ్ర భూ రీసర్వే ద్వారా పరిష్కరిస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. మరో ఏడాదిన్నర వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా సర్వే పూర్తి చేసి రైతులకు, భూయజమానులకు శాశ్వత పరిష్కారం అందిస్తామన్నారు.

ఈ ప్రజాదర్బార్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నర్వ ఆదర్శ మండలం కావాలి



- **యాంకీలో కంటైనర్ అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం**
- **అభివృద్ధి కార్యక్రమాలకు కలెక్టర్ ప్రియాంక పిలుపు**
- **చిన్నారుల విద్య, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి**
- **ప్రత్యామ్నాయ పంటల సాగు చేయాలని రైతులకు సూచన**

**నారాయణపేట, జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):** నర్వ మండలం జాతీయ స్థాయిలో ఆదర్శ మండలంగా గుర్తింపు పొందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక పిలుపునిచ్చారు. గురువారం నర్వ మండలంలోని యాంకీ గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన కంటైనర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని గ్రామ సర్పంచి కల్యాణితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సరస్వతి మాత చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కేంద్రంలోని చిన్నారులతో మమేకమయ్యారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల హాజరు, అందుతున్న సేవలపై కలెక్టర్ ఆరా తీశారు. కేంద్రంలో ఎంతమంది చిన్నారులు ఉన్నారు, వారికి అందుతున్న సౌకర్యాలపై అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేంద్రం ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలని పిలుపునిచ్చారు.

గ్రామంలోని ప్రతి చిన్నారి తప్పనిసరిగా విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం కావడం సంతోషకరమని పేర్కొంటూ, దీనిని పరిశుభ్రంగా, భద్రంగా సంరక్షించాలని సూచించారు. నర్వ మండలంలో యాస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమం కింద ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. గ్రామాల అవసరాలకు అనుగుణంగా కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పిస్తే అందుబాటులో ఉన్న నిధులతో ఆమోదం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. మండలంలోని అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు, సర్పంచ్‌లను ఆదేశించారు.

ఉపాధి హామీ పథకం కింద మరుగుదొడ్ల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల పనులను త్వరగా పూర్తి చేస్తే బిల్లులు కూడా వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పత్తి, వరి వంటి సంప్రదాయ పంటలకు బదులుగా కందులు, పెసర్లు వంటి స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి రాజేందర్ గౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వెంకటరాములు, తహసీల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, యాస్పిరేషన్ బ్లాక్ సమన్వయకర్త బాలాజీ, సీడీపీవో, గ్రామ పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

# ఉత్తర తెలంగాణను ముంచెత్తిన వానలు

- **వాయుగుండం ప్రభావంతో ఎడతెరిపి లేని వర్షా లు**
- **రెండు జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు**
- **జంపన్న వాగులో భక్తుడు గల్లంతు**
- **లోతట్టు ప్రాంతాల్లో వరదల ముప్పు**

**హైదరాబాద్, జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గత 48 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పలు లోతట్టు ప్రాంతాలు జలమయమవగా, రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గ్రామాల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. నిర్మల్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. వాగులు ప్రమాదకర స్థాయిలో ప్రవహించడంతో పలు గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. రహదారులపై వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పలుచోట్ల వంతెనలపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో అధికారులు ప్రయాణాలు చేయవద్దని హెచ్చరికలు జారీ చేశారు.

వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత ఆయా జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, విద్యాసంస్థలకు గురువారం సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అవసరమైతే తదుపరి పరిస్థితులను సమీక్షించి మరిన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ములుగు జిల్లాలోనూ భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. కన్నాయిగూడెం ప్రాంతంలో అత్యధిక వర్షపాతం నమోదుకావడంతో వరద పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు వరద బాధితుల కోసం అత్యవసర పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రమాద ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టారు. సహాయక బృందాలు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాయి.

ఇదిలా ఉండగా, ప్రముఖ పుణ్యక్షేత్రమైన మేడారంలో జంపన్న వాగు ఉగ్రరూపం దాల్చింది. వాగులో స్నానం చేసేందుకు దిగిన ఘట్‌కేసర్‌కు చెందిన ఓ భక్తుడు నీటి ఉద్ధృతికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు,



విపత్తు స్పందన బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు ప్రారంభించాయి. అయితే వాగులో ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. నదులు, వాగులు, చెరువుల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర యంత్రాంగం పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన సహాయక చర్యలను వేగవంతం చేస్తోంది.





# సాంకేతిక వ్యవస్థల వెన్నెముకలు

**డెస్క్, జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రతి సంవత్సరం జూలై నెల చివరి శుక్రవారం సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ల అభినందన దినోత్సవాన్ని నిర్వహిస్తారు. కంప్యూటర్ నెట్‌వర్క్‌లు, సర్వర్లు, సమాచార వ్యవస్థలు, కార్యాలయాల సాంకేతిక మౌలిక సదుపాయాలను నిరంతరం పర్యవేక్షిస్తూ సంస్థల పనితీరును సజావుగా కొనసాగించే సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ల సేవలను గుర్తించి వారికి కృతజ్ఞతలు తెలియజేయడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం. 2026లో ఈ దినోత్సవం జూలై 31న వచ్చింది. నేటి డిజిటల్ ప్రపంచంలో ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, పరిశ్రమలు, వార్తా సంస్థలు, వ్యాపార సంస్థలు, సమాచార సాంకేతిక సంస్థలు అన్నీ కంప్యూటర్ వ్యవస్థలపైనే ఆధారపడి పనిచేస్తున్నాయి. ఈ వ్యవస్థలు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం పనిచేసేలా చూసే బాధ్యత సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్లపై ఉంటుంది. సాధారణంగా వారి పని బయటకు కనిపించకపోయినా, ప్రతి సంస్థ విజయవంతమైన పనితీరులో వారి పాత్ర అత్యంత కీలకమైనది.

సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్లు కంప్యూటర్ సర్వర్ల నిర్వహణ, నెట్‌వర్క్ ఏర్పాటు, వినియోగదారుల ఖాతాల నిర్వహణ, సమాచార భద్రత, సమాచార నిల్వ, బ్యాకప్ వ్యవస్థలు, కొత్త సాఫ్ట్‌వేర్‌ల ఏర్పాటు, సాంకేతిక సమస్యల పరిష్కారం వంటి అనేక బాధ్యతలను నిర్వర్తిస్తుంటారు. ఒక చిన్న సాంకేతిక లోపం కూడా సంస్థ కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉండటంతో వారు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటారు. ప్రస్తుతం సైబర్ నేరాలు, వైరస్ దాడులు, సమాచార చోరీ, అనధికార ప్రవేశాలు



వంటి ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ల బాధ్యతలు మరింత పెరిగాయి. సంస్థలకు సంబంధించిన కీలక సమాచారాన్ని రక్షించడం, భద్రతా వ్యవస్థలను ఎప్పటికప్పుడు నవీకరించడం, అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవడం వంటి కీలక పనులు కూడా వారే నిర్వహిస్తారు. సంస్థల డిజిటల్ భద్రతకు వారు మొదటి రక్షణ కవచంగా నిలుస్తున్నారు. ఏదైనా సాంకేతిక సమస్య ఏర్పడితే ఇతర ఉద్యోగులు కార్యాలయం విడిచి వెళ్లినా సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్లు మాత్రం సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు పనిచేయాల్సి వస్తుంది. రాత్రివేళల్లోనూ, సెలవు రోజుల్లోనూ అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే స్పందించి వ్యవస్థలను పునరుద్ధరిస్తారు. అందుకే వారి సేవలను చాలామంది కనిపించని కృషిగా అభివర్ణిస్తుంటారు. ఈ దినోత్సవాన్ని 2000 సంవత్సరంలో అమెరికాకు చెందిన టెడ్ కెక్కాటోస్ ప్రారంభించారు. ఒక ప్రకటనలో సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్‌కు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపే దృశ్యం చూసిన ఆయన, వాస్తవ జీవితంలో కూడా అలాంటి గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక దినాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రపంచంలోని అనేక దేశాల్లో జూలై చివరి శుక్రవారం ఈ దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా మారింది. సాంకేతిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న కొద్దీ సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ల పాత్ర కూడా మారుతోంది. క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, డేటా కేంద్రాలు, దూర విధానంలో పని, డిజిటల్ సేవల విస్తరణ వంటి పరిణామాలతో వారు కొత్త నైపుణ్యాలను అలవరుచుకుంటూ సమాచార వ్యవస్థలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఆధునిక సంస్థల విజయానికి వారి నైపుణ్యం కీలకంగా మారింది. ఈ సందర్భంగా అనేక సంస్థలు తమ సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్లను ప్రత్యేకంగా అభినందిస్తాయి. ప్రశంసాపత్రాలు అందించడం, సన్మాన కార్యక్రమాలు నిర్వహించడం, ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడం, ఉద్యోగుల తరఫున కృతజ్ఞతలు తెలియజేయడం వంటి కార్యక్రమాలు చేపడతారు. వారి కృషిని గుర్తించడం ద్వారా ఉద్యోగుల్లో మరింత ఉత్సాహం పెరుగుతుందని సంస్థలు భావిస్తున్నాయి. డిజిటల్ సేవలు వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ల సేవలు సమాజానికి కూడా ఎంతో అవసరమయ్యాయి. బ్యాంకింగ్ లావాదేవీల నుంచి వైద్య సేవల వరకు, విద్యా వ్యవస్థల నుంచి ప్రభుత్వ సేవల వరకు ప్రతి రంగంలోనూ కంప్యూటర్ వ్యవస్థలు నిరంతరం పనిచేయాలంటే వారి నిబద్ధత ఎంతో అవసరం. అందుకే సమాచార యుగానికి వారిని నిశ్శబ్ద వీరులుగా పలువురు అభివర్ణిస్తున్నారు. సాంకేతిక ప్రపంచం నిరంతరం ముందుకు సాగాలంటే బలమైన సమాచార వ్యవస్థలు అవసరం. ఆ వ్యవస్థలకు జీవం పోసే సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ల సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి సంస్థ బాధ్యత. కనిపించకుండా కష్టపడే ఈ సాంకేతిక నిపుణుల కృషివల్లే కోట్లాది మంది ప్రజలు ప్రతిరోజూ అంతరాయం లేకుండా డిజిటల్ సేవలను వినియోగించగలుగుతున్నారు. అందుకే సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ల అభినందన దినోత్సవం వారి సేవలను గుర్తుచేసే ఒక ప్రత్యేక సందర్భంగా నిలుస్తోంది.

# ప్రతీకారంతో చరిత్ర సృష్టించిన వీరుడు

**డెస్క్, జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):** భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో అసమాన ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన అమర వీరుడు ఉధమ్ సింగ్‌కు ప్రతి సంవత్సరం జూలై 31న నివాళులు అర్పిస్తారు. జలియన్‌వాలాబాగ్ హత్యాకాండకు బాధ్యుడిగా భావించిన మైఖేల్ ఓ'డ్వయర్‌ను హతమార్చి వేలాది మంది అమరుల ఆత్మలకు న్యాయం చేశాడనే భావనతో దేశవ్యాప్తంగా ఆయనను స్మరించుకుంటారు. ముఖ్యంగా పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో ఈ దినానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. 1919 ఏప్రిల్ 13న పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఉన్న జలియన్‌వాలాబాగ్‌లో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా శాంతియుతంగా సమావేశమైన వేలాది మంది ప్రజలపై బ్రిగేడియర్ జనరల్ రెజినాల్డ్ డయ్యర్ సైనికులతో విచక్షణారహితంగా కాల్పులు జరిపించాడు. ఈ ఘటనలో వందలాది మంది ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది గాయపడ్డారు. ఆ సమయంలో పంజాబ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న మైఖేల్ ఓ'డ్వయర్ ఆ దమనకాండకు రాజకీయ మద్దతు ఇచ్చాడని భావించబడింది. ఈ ఘటన భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసింది. జలియన్‌వాలాబాగ్ మారణకాండను ప్రత్యక్షంగా చూసిన ఉధమ్ సింగ్ తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. అమాయకుల రక్తపాతాన్ని మరచిపోకుండా, ఈ దారుణానికి బాధ్యులపై ప్రతీకారం తీర్చుకోవాలని అప్పుడే సంకల్పించాడు. ఆ లక్ష్యంతో ఎన్నో సంవత్సరాలు ఓర్పుగా ఎదురుచూశాడు. దేశభక్తి, ధైర్యం, సంకల్పం కలిసిన ఆయన జీవితం స్వాతంత్ర్య పోరాటంలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచింది. 1940 మార్చి 13న లండన్‌లోని క్యాక్స్‌న్ హాల్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న మైఖేల్ ఓ'డ్వయర్‌పై ఉధమ్ సింగ్ కాల్పులు జరిపి హతమార్చాడు. ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అనంతరం ఆయనను బ్రిటిష్ పోలీసులు అరెస్టు చేశారు. విచారణ సందర్భంగా తాను చేసిన పనిపై ఎలాంటి పశ్చాత్తాపం లేదని, జలియన్‌వాలాబాగ్ అమరులకు న్యాయం చేయడానికే ఈ చర్య చేపట్టానని ధైర్యంగా ప్రకటించాడు. బ్రిటిష్ న్యాయస్థానం ఉధమ్ సింగ్‌కు మరణశిక్ష విధించింది.



1940 జూలై 31న లండన్‌లోని పెంటన్‌విల్ జైలులో ఆయనను ఉరితీశారు. చివరి క్షణం వరకు భారత స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను అర్పించడానికి వెనుకాడలేదు. ఆయన త్యాగం భారత యువతలో స్వాతంత్ర్య స్ఫూర్తిని మరింత పెంచిందని చరిత్రకారులు పేర్కొంటారు. ఉధమ్ సింగ్ తన పేరును "రామ్ మహ్మద్ సింగ్ ఆజాద్"గా పేర్కొనడం ఆయన విశాల దృక్పథానికి నిదర్శనం. హిందూ, ముస్లిం, సిక్కు మతాల ఐక్యతకు ప్రతీకగా ఈ పేరును స్వీకరించాడు. మతాలకు అతీతంగా దేశ స్వాతంత్ర్యమే తన లక్ష్యమని ప్రపంచానికి చాటి చెప్పాడు. ఆయన ఆలోచనలు జాతీయ సమైక్యతకు ఆదర్శంగా నిలిచాయి. 1974లో ఉధమ్ సింగ్ భౌతిక అవశేషాలను బ్రిటన్ నుంచి భారత్‌కు తీసుకొచ్చారు. పంజాబ్‌లో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించి ఆయనకు ఘన నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సమర యోధుడిగా ఆయన సేవలను గుర్తిస్తూ పలు స్మారక చిహ్నాలు, విగ్రహాలు, విద్యాసంస్థలు, రహదారులకు ఆయన పేరు పెట్టారు. ఉధమ్ సింగ్ అమరవీరుల దినం సందర్భంగా పంజాబ్, హర్యానాతో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో నివాళి కార్యక్రమాలు నిర్వహిస్తారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు ఆయన జీవిత విశేషాలను విద్యార్థులకు వివరిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు చేపడతాయి. జలియన్‌వాలాబాగ్ అమరులను స్మరించుకుంటూ దేశభక్తి కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# బోనాలకు గవర్నర్‌కు ఆహ్వానం

- కొండా సురేఖ మర్యాదపూర్వక భేటీ
- లష్కర్ బోనాల ఉత్సవాలకు ఆహ్వాన పత్రం
- లోక్ భవన్‌లో సమావేశం

హైదరాబాద్, జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణలో నిర్వహించనున్న ఆషాఢ జాతర (లష్కర్ బోనాలు) ఉత్సవాలకు రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాను ఆహ్వానించారు. ఈ మేరకు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు కూడా సమావేశంలో పాల్గొన్నారు. సికింద్రాబాద్‌లో జరగనున్న ఆషాఢ జాతర, లష్కర్ బోనాల ఉత్సవాల విశిష్టత, ఏర్పాట్ల గురించి గవర్నర్‌కు వివరించారు. ఉత్సవాలకు హాజరై భక్తులను ఆశీర్వదించాలని కోరారు.

మంత్రి కొండా సురేఖ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహోత్సవమని తెలిపారు. ప్రతి ఏడాది లక్షలాది మంది భక్తులు పాల్గొనే ఈ ఉత్సవాలు రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. ఈసారి కూడా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు, భక్తులకు అవసరమైన సౌకర్యాలు, భద్రతా చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ హనుమంతరావు గవర్నర్‌కు వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆహ్వానాన్ని స్వీకరించి బోనాల ఉత్సవాల నిర్వహణపై వివరాలను అడిగి తెలుసుకున్నట్లు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ఉన్న విశిష్ట స్థానాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించినట్లు సమాచారం. లోక్ భవన్‌లో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీ స్నేహపూర్వక వాతావరణంలో సాగింది. బోనాల ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై చర్చించినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రజలు భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకల్లో పాల్గొని పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.

# వేములవాడ బస్‌స్టేషన్‌కు కొత్త రూపు

- రూ.1.62 కోట్లతో ఆధునీకరణ పనులకు శ్రీకారం
- కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభం
- మహాలక్ష్మి పథకం విజయవంతంగా అమలవుతోందన్న మంత్రి
- ఆర్టీసీ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి



రాజన్న సిరిసిల్ల, జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):

మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం వేములవాడ-కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని తెలిపారు. ఈ పథకం వల్ల మహిళల ప్రయాణాలు గణనీయంగా పెరగడంతో పాటు ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య కూడా పెరిగిందన్నారు. ఇప్పటివరకు 334.11 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి సుమారు రూ.11,668 కోట్ల మేర ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకున్నారని వెల్లడించారు.

1984లో నిర్మించిన వేములవాడ బస్‌స్టేషన్‌ను రూ.1.62 కోట్ల వ్యయంతో ఆధునీకరిస్తున్నామని మంత్రి తెలిపారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడకు ప్రతిరోజూ సుమారు 250 బస్సులు, 560 ట్రిప్పులు నడుస్తున్నాయని, రోజుకు దాదాపు 50 వేల మంది ప్రయాణికులు ఈ బస్‌స్టేషన్‌ను వినియోగిస్తున్నారని చెప్పారు. కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించామని, గతంలో ముంబైకి కూడా బస్సు సౌకర్యం కల్పించినట్లు గుర్తు చేశారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని ప్రభుత్వం లాభాల బాట పట్టించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,600 కొత్త బస్సులు కొనుగోలు చేశామని, సిబ్బంది నియామకాలు చేపట్టడంతో పాటు దాదాపు రూ.100 కోట్లతో బస్‌స్టేషన్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులకు సుమారు రూ.1,000 కోట్ల భవిష్య నిధి బకాయిలు, రూ.600 కోట్ల సీసీఎస్ బకాయిలు చెల్లించినట్లు వెల్లడించారు.

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన దేవాలయ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తెలంగాణ ఆర్టీసీ దేశంలోనే అతిపెద్ద ప్రజారవాణా సంస్థగా మహిళలకు ఉచిత ప్రయాణాన్ని విజయవంతంగా అందిస్తోందని పేర్కొన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, అదే క్రమంలో బస్‌స్టేషన్ ఆధునీకరణ కూడా ముఖ్యమైన అడుగని తెలిపారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణకు రూ.1.62 కోట్లు మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఆధునీకరించిన బస్‌స్టేషన్ వల్ల రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సంజయ్ కుమార్, ఎస్పీ మహేష్ బి. గితే, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ‘ప్యారడైజ్’కు జాన్వీ దూరం.. కాయదు లోహర్‌కు అవకాశం

నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం ‘ప్యారడైజ్’పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ‘దసరా’ విజయవంతమైన తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నాని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న రెండో చిత్రం కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రత్యేక ఆసక్తి కనిపిస్తోంది.

‘దసరా’, ‘హాయ్ నాన్న’, ‘సరిపోదా శనివారం’ విజయాల తర్వాత నాని మరోసారి విభిన్న కథతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఈ చిత్రంలో ప్రముఖ నటుడు మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తుండగా, సంపూర్ణేష్ బాబు కూడా మరో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు.

ఈ చిత్రంలో కథానాయికగా ప్రస్తుతం కాయదు లోహర్ నటిస్తున్నారు. అయితే తొలుత ఈ పాత్ర కోసం బాలీవుడ్ నటి జాన్వీ కపూర్‌ను సంప్రదించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఇతర చిత్రాలతో బిజీగా ఉండటంతో తేదీలు సర్దుబాటు కాకపోవడంతో ఆమె ఈ చిత్రాన్ని అంగీకరించలేదని సమాచారం. దీంతో ఆ పాత్రకు కాయదు లోహర్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.

1980ల కాలంలో సికింద్రాబాద్ నేపథ్యంతో ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పోస్టర్లు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన పొందాయి. మాస్ యాక్షన్‌తో పాటు భావోద్వేగ అంశాలకు ప్రాధాన్యం ఇచ్చే కథతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు చిత్రబృందం చెబుతోంది.

అయితే జాన్వీ కపూర్ ఈ చిత్రం నుంచి తప్పుకున్న విషయంపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం నిర్మాణ పనులు కొనసాగుతున్న ఈ చిత్రం విడుదలపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.



# కరీంనగర్‌కు మెట్రో ఎక్స్‌ప్రెస్ సేవలు

- మూడు మార్గాల్లో కొత్త సిటీ బస్సుల ప్రారంభం
- ప్రజా రవాణా విస్తరణకు ప్రభుత్వం చర్యలు
- బస్సులో ప్రయాణించి సేవలను పరిశీలించిన మంత్రి
- ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం



కరీంనగర్, జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):

కరీంనగర్ నగర ప్రజలకు మరింత మెరుగైన ప్రజా రవాణా సేవలు అందించాలనే లక్ష్యంతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బస్‌స్టేషన్‌లో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు సేవలను రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. తొలి దశలో మూడు ప్రధాన మార్గాల్లో ఈ బస్సు సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. అనంతరం మంత్రి కరీంనగర్ బస్‌స్టేషన్ నుంచి వాగేశ్వరి కళాశాల వరకు సిటీ బస్సులో ప్రయాణించి ప్రయాణికులతో ముచ్చటిస్తూ సేవలను పరిశీలించారు. మొదటి దశలో కరీంనగర్-వాగేశ్వరి కళాశాల, కరీంనగర్-చింతకుంట, కరీంనగర్-కొత్తపల్లి హవేలీ మార్గాల్లో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపనున్నట్లు మంత్రి తెలిపారు. నగర శివారు ప్రాంతాల ప్రజలకు వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రజా రవాణా అందించడమే ఈ సేవల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, రోజువారీ ప్రయాణికులకు ఈ బస్సులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త మార్గాల్లో బస్సు సేవలను విస్తరిస్తూ, సౌకర్యవంతమైన రవాణా అందించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కృషి చేస్తోందన్నారు. నగరాల్లో పెరుగుతున్న ప్రయాణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని ఆధునిక సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. బస్సులో ప్రయాణించిన సందర్భంగా ప్రయాణికులతో మంత్రి నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. బస్సు సేవల నాణ్యత, సమయపాలన, సౌకర్యాలపై ప్రజల సూచనలు స్వీకరించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా రవాణా సేవలు అందించేందుకు అవసరమైన మార్పులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ కొత్త సేవలతో కరీంనగర్ నగరంలో ప్రజా రవాణాపై ఆధారపడే ప్రయాణికులకు మరింత సౌలభ్యం కలుగుతుందని అధికారులు తెలిపారు. నగరంలోని ప్రధాన విద్యాసంస్థలు, నివాస ప్రాంతాలు, వాణిజ్య కేంద్రాలను అనుసంధానించేలా మార్గాలను రూపొందించడం వల్ల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, రవాణా ప్రాధికార సంస్థ సభ్యుడు పడాల రాహుల్, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అంజన్ కుమార్, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, మున్సిపల్ కమిషనర్, ప్రాంతీయ మేనేజర్, డిపో మేనేజర్, ఆర్టీసీ అధికారులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు కవిత భరోసా

- లాస్ట్ మైల్ విధానంపై తీవ్ర అభ్యంతరం
- ఆటో యూనియన్లతో చర్చించాలని డిమాండ్
- ఉపాధి దెబ్బతింటే ఉద్యమిస్తామని హెచ్చరిక
- ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి పిలుపు



హైదరాబాద్, జూలై 30 (తెలంగాణ ముచ్చట్లు):

బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆటో డ్రైవర్లతో అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమావేశమయ్యారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పేరుతో ప్రభుత్వం అమలు చేయనున్న విధానం వల్ల తమ ఉపాధి కోల్పోతామంటూ ఆటో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారి సమస్యలు విన్న కవిత, ఆటో డ్రైవర్లకు తమ పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. కవిత మాట్లాడుతూ లాస్ట్ మైల్ కనెక్టివిటీ పేరుతో ప్రభుత్వం ఆటో డ్రైవర్ల జీవనోపాధిపై ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ప్రయాణికులు బస్సు దిగిన తర్వాత ప్రస్తుతం ఉన్న ఆటోలను వినియోగించుకునే అవకాశం ఉండగా, అదే సేవను ప్రభుత్వమే నిర్వహించాలని చూడటం వేలాది మంది ఆటో డ్రైవర్లకు నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఆటోలు నడుపుతున్న వారికే లాస్ట్ మైల్ కనెక్టివిటీ సేవల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ల ఆదాయం గణనీయంగా తగ్గిందని కవిత అన్నారు. చాలామంది ఆటో డ్రైవర్లు వాహనాల రుణాల వాయిదాలు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం ఈవీ ఆటోలను ప్రవేశపెట్టి వాటిని ప్రభుత్వ ఆధ్వర్యంలో నడపాలని ప్రయత్నించడం ఆటో డ్రైవర్లకు మరింత భారంగా మారుతుందని విమర్శించారు. ఆటో డ్రైవర్లకు వన్ స్టేట్-వన్ పర్మిట్ విధానం అమలు చేస్తామని, ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీలు ఇంకా నెరవేరలేదని కవిత ఆరోపించారు. మరోవైపు నిబంధనల ఉల్లంఘన పేరుతో వరుసగా చలాన్లు విధించడం వల్ల డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో యూనియన్లతో చర్చించి వారి ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

లాస్ట్ మైల్ కనెక్టివిటీ సేవలను ఇప్పటికే ఆటోలు నడుపుతున్న డ్రైవర్ల ద్వారానే అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ తదితర నగరాల్లో కూడా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొంటూ, ఆటో డ్రైవర్ల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా తీవ్రంగా వ్యతిరేకిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోకపోతే తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లతో కలిసి ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తామని కవిత ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని ఆటో డ్రైవర్లకు మేలు జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in